సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024

ముఖ్యమంత్రిని కలిసిన అన్నయ్యగౌడ్



సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన అంతటి అన్నయ్యగౌడ్ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయన వెంట ఉన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్‌రెడ్డిని అన్నయ్యగౌడ్ శాలువాతో సన్మానించారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నగునూరి అశోక్ కుమార్, మాజీ సర్పంచులు మినుపాల ప్రకాశ్‌రావు, దుగ్యాల సంతోష్‌రావు, జగన్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఉట్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సమాజ సేవతోనే గుర్తింపు



మాట్లాడుతున్న కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): సమాజ సేవతోనే మంచిగుర్తింపు లభిస్తుందని ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. మేడిపల్లి సెంటర్‌లోని సాయి సేవా సమితి 25వ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసినవారు సాయి సేవా సమితి ద్వారా సమాజ సేవలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, సంస్థ వ్యవస్థాపకుడు పి.రామదాసు, అధ్యక్షుడు విశ్వనాథ్, కార్యదర్శి అశోక్‌రెడ్డి, కొమురయ్య, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీపీసీ డ్యామ్‌కు భద్రత



గేటు వద్ద కాపలా కాస్తున్న భద్రత సిబ్బంది

రామగుండం: అంతర్గాం మండలం కుందనపల్లి పంచాయతీ పరిధిలోని ఎన్టీపీసీ డ్యామ్‌కు అధికారులు భద్రత కట్టుదిట్టం చేశారు. డ్యామ్‌కు వెళ్లే రోడ్డుపై మెయిన్ గేటు ఏర్పాటు చేసి సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. ఇదంతా బాగానే ఉన్నా.. సమీపంలోని ఖాళీ ప్రదేశంలో దహన సంస్కారాలు చేయడం గ్రామస్తులకు ఇబ్బందిగా మారుతోంది. గొర్రెలు, పశువుల మేతకు ఆటంకం కలుగుతోంది. మత్స్యకారులు చేపల వేట కొనసాగించలేకపోతున్నారు. అధికారులు మానవతా దృక్పథంతో తమ అవసరాలకు డ్యామ్ వద్దకు వెళ్లేందుకు అనుమతించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మతోన్మాదంపై ఉక్కుపాదం మోపాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: మత కలహాలను సృష్టించేలా హిందూ ఆలయాలు, హిందువులపై దాడులకు పాల్పడుతున్న మతోన్మాదులపై ఉక్కుపాదం మోపాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, పెద్దపల్లి ప్రఖండ అధ్యక్షుడు విజయ్‌కుమార్ కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. హిందువుల విశ్వాసాలు, ఆలయాలు లక్ష్యంగా జరుగుతున్న దాడులపై హిందూ సమాజం ఆవేదన చెందుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, బొమ్మకంటి రవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం శిబిరాలు

పెద్దపల్లిరూరల్: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు నవంబర్ 5 – 7వ తేదీ వరకు ప్రత్యేక వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమశాఖ అధికారి వేణుగోపాల్ శనివారం తెలిపారు. నవంబర్ 5న పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్వహించే శిబిరంలో పెద్దపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాలకు చెందిన దివ్యాంగులకు వైకల్యం నిర్ధారణ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా నవంబర్ 6న మంథని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, మంథని ప్రాంతాల వారికి, నవంబర్ 7న ఆర్జీ –1 కమ్యూనిటీహాల్ ఆవరణలో నిర్వహించే శిబిరంలో రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని ఆయన వివరించారు. ఆసక్తి, అర్హత గలవారు సకాలంలో శిబిరాలకు హాజరు కావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 94408 52495, 70137 55418లో సంప్రదించాలని ఆయన కోరారు.

'జమిలి ఎన్నికలకు వ్యతిరేకం'

గోదావరిఖని: జమిలి ఎన్నికలతో రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, దీనికి తాము వ్యతిరేకమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ అన్నారు. నగరంలో శనివారం నిర్వహించిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలు (జమిలి ఎన్నికలు) నిర్వహించాలని కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదించిందని ఆయన గుర్తుచేశారు. జమిలి ఎన్నికలతో రెండు మౌలిక పునాదులైన ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానాలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర హక్కులు ఉల్లంఘనకు గురవుతాయని ఆయన అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, నాయకులు ముత్యంరావు, ఎ.మహేశ్వరి, ఎం.రామాచారి, మెండె శ్రీనివాస్, ఎస్.శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. న్యూడ్ కాల్స్

- ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేకు షాకిచ్చిన మహిళ
- నగ్నంగా వీడియో కాల్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు
- వీఐపీలు, మహిళలే టార్గెట్‌గా సైబర్ అరాచకాలు
- యూపీ, రాజస్థాన్, కాంబోడియా నుంచి ఆపరేట్
- ఏఐ సాంకేతికతతో చాటింగ్, వీడియో కాల్స్
- అపరిచిత కాల్స్ లిఫ్ట్ చేయొద్దంటున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో కేసుల వివరాలు

రామగుండం కమిషనరేట్	179
కరీంనగర్ కమిషనరేట్	62
రాజన్నసిరిసిల్ల	58
జగిత్యాల	74



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేను వీడియో కాల్ కంగారు పెట్టించింది. హైదరాబాద్ వరకు పరుగులు తీయించింది. అసలేం జరిగిందంటే.. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని నంబర్ నుంచి ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేకు వీడియో కాల్ వచ్చింది. తన నియోజకవర్గం వారే అయి ఉంటారని ఆయన లిఫ్ట్ చేశారు. అంతే.. అవతలివైపు ఓ మహిళ నగ్నంగా ఉండి, మాట్లాడటం మొదలుపెట్టింది. ఒకటి రెండు సెకండ్లపాటు ఎమ్మెల్యేకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. వెంటనే, అప్రమత్తమై సదరు కాల్ డిస్‌కనెక్ట్ చేశారు. మరునాడు ఉదయం హుటాహుటిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు, నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌తోపాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీ సీఎస్‌బీ)కు కూడా ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో ప్రత్యర్థులతో తనకు కొనసాగుతున్న రాజకీయ పోరు నేపథ్యంలో ఈ పని చేయించింది వారేనని ఆయన అనుమానిస్తున్నారు. పోలీసులు మాత్రం ఈ కాల్స్ వెనక ఎలాంటి రాజకీయ కుట్ర లేదని భావిస్తున్నట్లు సమాచారం. ఇది ప్రొఫెషనల్ సైబర్ నేరగాళ్లు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఎమ్మెల్యేకు వీడియో కాల్ వచ్చిన నంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. సదరు వీడియో కాల్ యూపీ నుంచి వచ్చినట్లు తెలిసింది.

లిఫ్ట్ చేస్తే ఏమవుతుంది?

కరోనా తర్వాత సెల్‌ఫోన్, డేటా వినియోగం పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకొని, వీఐపీలు, డాక్టర్లు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, యువతులు లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు చెలరేగుతున్నారు. అందమైన అమ్మాయిల డీపీలు పెట్టి, వాట్సాప్‌లో తొలుత చాటింగ్ చేసి, తర్వాత వీడియో కాల్స్ చేస్తున్నారు. వాటిని రికార్డ్ చేసి, అనంతరం డబ్బులివ్వాలని బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతున్నారు. ఇందుకోసం రాత్రి సమయాన్ని ఎంచుకుంటున్నారు. ఆ సమయంలో మద్యం సేవించి ఉంటారు కాబట్టి సులువుగా తప్పు చేస్తారన్నది వీరి వ్యూహంగా తెలుస్తోంది.

నేరగాళ్లకు సమాచారం ఇచ్చేది మీరే..

ఎక్కడో యూపీ, నోయిడా, కాంబోడియా, థాయ్‌లాండ్ దేశాల్లో కూర్చొని, నేరాలకు పాల్పడేవారికి మీ డేటా ఎలా వెళ్లిందనేగా మీ అనుమానం? వారికి ఆ డేటా అందజేసేది మీరే.. ప్రతీ చిన్న వ్యవహారాన్ని ఫొటోలు తీసి, పెడుతుంటారు. మీ ఫోన్ నంబర్, కుటుంబసభ్యుల వివరాలు, పెళ్లిరోజు, పుట్టిన రోజు తదితరాలన్నీ.. మీ ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా ఖాతాల ద్వారా తెలుసుకుంటారు. అందుకే, వీలైనంత వరకు ప్రైవసీ ఉండేలా సెట్టింగ్స్ మార్చుకోండి.

మాట్లాడేది మని'షి' కాదు..

వాస్తవానికి ఇలాంటి ఘటనల్లో నగ్నంగా కనిపించేది, మాట్లాడేది యువతులు, మహిళలు కాదు.. అసలు మనిషే కాదు. అదంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో సృష్టించిన సాఫ్ట్‌వేర్. ఇది నేరగాళ్లు చెప్పినట్లే నడుచుకుంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ చాటింగ్‌కు, వీడియో కాల్స్‌కు ఎలా స్పందించాలో ముందే అల్గారిథమ్‌లో పొందుపరుస్తారు. అలా ఎదుటివారికి ఎలాంటి అనుమానం రాదు. ఇది తెలియక అవతలవైపు నిజంగా.. మనిషే ఉందన్న భ్రమలో చాలామంది వారు చెప్పినట్లు చేసి, కష్టాలు కొనితెచ్చుకుంటారు.

కాల్ వస్తే ఏం చేయాలి?

అపరిచిత వీడియో కాల్స్ వస్తే.. ఫ్రంట్ కెమెరాపై చూపుడు వేలు పెట్టి, లిఫ్ట్ చేయాలి. అవతలివైపు ఉన్నది మీకు తెలిసినవారు అయితేనే.. కాల్ కొనసాగించాలి. అనుమానాస్పద వ్యక్తులు అని అనుమానం వస్తే.. వెంటనే కట్ చేయాలి. వాస్తవానికి మీరేం చేయకపోయినా వీడియో కాల్స్ మాట్లాడితే చాలు.. మీ ఫేస్‌ను క్యాప్చర్ చేసి, డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా తిరిగి మీకే పంపి, డబ్బులు డిమాండ్ చేస్తారు.


అవగాహన కల్పిస్తున్నాం



ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్లు ఉంటారు. ఎన్ని రకాల నేరాలు జరుగుతున్నాయో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఏమరుపాటుగా ఉండి, చాలామంది బ్లాక్ మెయిల్‌కు గురై, లక్షల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి నేరాలు జరిగిన వెంటనే నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్(1930) లేదా సమీపంలోని సైబర్ క్రైం సెల్‌లో ఫిర్యాదు చేయాలి.

– వెంకటరమణ, ఏసీపీ, రామగుండం

పట్టించుకుంటే.. పర్యాటకమే



ఎలగందుల ఖిల్లా

చరిత్ర గతించినా.. నాటి చారిత్రక వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు కట్టడాలు. ఎలగందుల ఖిల్లా, రామునిగుండాల, కోటిలింగాల, ఎల్లంపల్లి ప్రాజెక్టు, కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం, రాయికల్ చెన్నకేశవనాథ స్వామి ఆలయం, అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు, మధ్యమానేరులోని దత్తాత్రేయస్వామి ఆలయం.. ఇలా ఎన్నో ఉన్నాయి. నిర్మాణం, చరిత్రలో వేటికవే ప్రత్యేకం. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా.. అవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. అరకొర నిధుల విడుదలతో అసంపూర్తి నిర్మాణాలు, అసౌకర్యాలు, రవాణా సదుపాయం లేకపోవడం వంటివే పర్యాటకులు, భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. పాలకులు పట్టించుకొని, సౌకర్యాలు కల్పిస్తే ప్రతీ ప్రాంతం పర్యాటకంగా విరాజిల్లుతుంది. పర్యాటకుల తాకిడి పెరిగి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

– వివరాలు 8లో..



రాయికల్ చెన్నకేశవనాథ త్రికూటాలయం

యువతకు ఉపాధి గ్యారంటీ



ఐటీఐ భవనం పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి గ్యారంటీగా లభించే ప్రభుత్వ ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఇచ్చే నైపుణ్యశిక్షణ ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ భవనాన్ని కలెక్టర్ శనివారం టీ వర్క్స్ సీఈవో జోగేందర్‌తో కలిసి పరిశీలించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఏటీసీ కేంద్రాలకు టీ వర్క్స్ ద్వారా అందించే సహకారం, కోర్సుల ద్వారా మార్కెట్‌లో లభించే ఉపాధి అవకాశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో సీఈవో జోగేందర్ వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెలాఖరులోగా ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివిధ కోర్సులకు సంబంధించి వచ్చిన సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోళ్లపై శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సుల్తానాబాద్‌లోని 8 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 57 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వరి కోతలు ముందుగానే ప్రారంభించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లో చెల్లింపులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, అధికారులు స్రవంతి, శంకర్‌గౌడ్, సంతోష్‌కుమార్, రమేశ్, సతీశ్, నబి, విక్రమ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధరణి అప్లికేషన్లు పెండింగ్‌లో పెట్టొద్దు

పాలకుర్తి(రామగుండం): ధరణి అప్లికేషన్లు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని, భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లోని ధరణి దరఖాస్తులపై ఆరా తీశారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. మీసేవా కేంద్రాల ద్వారా సర్టిఫికెట్ల కోసం వచ్చే దరఖాస్తులను తరచూ పరిశీలిస్తూ సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. అదేవిధంగా ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ ఇంతియాజ్‌కు సూచించారు.

దాతల సహకారం అభినందనీయం

డీఈవో మాధవి



స్టడీ మెటీరియల్ అందిస్తున్న మాధవి

రామగిరి(మంథని): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 23 మంది విద్యార్థుల కోసం గణిత ఉపాధ్యాయుడు మల్క రాంకిషన్ స్టడీ మెటీరియల్ కొనుగోలు చేశారు. తన స్నేహితులు తులసీరాం, డాక్టర్ రవితేజ, శ్యాం సహకారంతో ఒక్కొక్కరికి రూ.2,300 చొప్పున విలువైన స్టడీ కార్నర్ కొనుగోలు చేసి డీఈవో చేతుల మీదుగా అందజేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లే స్తోమత లేని అనేకమంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని డీఈవో తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయని అన్నారు. అంతేకాకుండా చాలామంది దాతలు ముందుకు వచ్చి తమ దాతృత్వం చాటుతూ పాఠశాలలు, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. దాతల సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాల, తల్లిదండ్రులు, దాతలు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్



వంటావార్పులో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులు, ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం గోదావరి నదిలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం వంటావార్పు నిర్వహించారు. కొప్పుల మాట్లాడుతూ, అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఎల్లంపల్లి నుంచి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు జనగామ కవితసరోజిని, శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు గోపు అయిలయ్య యాదవ్, అచ్చే వేణు, రమేశ్, తిరుపతి, రవీందర్, వేణు, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

నేడు మండల కేంద్రాల్లో ధర్నా..

వర్షాకాలంలో రైతుభరోసాను ఎగవేసిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆదివారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. రైతులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలి

జడ్జి శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని జిల్లా అడిషనల్ జడ్జి శ్రీనివాస్‌రావు సూచించారు. గోదావరిఖని సీఈఆర్ క్లబ్ ఆవరణలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు చట్టాలపై జడ్జి అవగాహన కల్పించారు. విద్యార్థి దశనుంచి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. ఆపద సమయంలో డయల్ 100 నంబరుకు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో గోదావరిఖని టూటౌన్ ఎస్సై అహ్మదుల్లా, న్యాయవాదులు సదన్ కుమార్, భూమయ్య, చరణ్‌రెడ్డి, శ్రావణ్, ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు కేశవ్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఓదెలు యాదవ్, హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు మంచిపేరు తేవాలి

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



పదోన్నతి పొందిన అధికారులతో సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పదోన్నతి ద్వారా పోలీసు శాఖకు మరింత పేరుప్రతిష్టలు తీసుకురావాలని రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. స్థానిక సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన ఆరుగురికి ర్యాంక్ పదోన్నతి చిహ్నం అలంకరించిన సీపీ.. వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతితోపాటు బాధ్యత కూడా పెరుగుతుందని, ఈనేపథ్యంలో క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజల్లో పోలీస్‌శాఖపై నమ్మకం, గౌరవం పెంచేలా వ్యవహరించాలని అన్నారు. మానసికంగా, శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతీఒక్కరు శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లాకుంట పోచలింగం పాల్గొన్నారు.

పథకాల్లో ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్యం

జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ రాజయ్య



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రాజయ్య

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కొట్టె రాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం వివిధ సంక్షేమ పథకాల అమలు, ఇతర అంశాలపై ట్రాన్స్‌జెండర్లకు ఆయన అవగాహన కల్పించారు. స్వయం ఉపాధి పొందేందుకు ట్రాన్స్‌జెండర్లు ముందుకు రావాలని సూచించారు. ఇందుకు అవసరమైన రుణాల మంజూరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. విద్య, వైద్యం, ఆరోగ్య, గృహ సంబంధిత అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ట్రాన్స్‌జెండర్లకు అవసరమైన రక్షణ కల్పిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా వారికి అందాల్సిన సేవల గురించి జిల్లా మహిళాసాధికారిత కేంద్ర బృందం సభ్యులు వివరించారు. ప్రతినిధులు అలేఖ్య, అనిల్‌కుమార్, సమత, ట్రాన్స్‌జెండర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కామేశ్వరి, ప్రతినిధులు కావ్య, సాలోని, లాస్య, అలకనంద, ధరణి, దుర్గ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని యువకుడి మృతి

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట – బల్లార్షా సెక్షన్ల మధ్యలోని పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీప గొల్లపల్లి గేట్‌వద్ద డౌన్‌లైన్‌లో ఓ రైలు ఢీకొని పురుషోత్తం శ్రావణ్ ఘోటి(23) మృతి చెందాడు. రామగుండం జీఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా చని గ్రామానికి చెందిన పురుషోత్తం శ్రావణ్‌ఘోటీ మతిస్థిమితం కోల్పోయాడు. కొద్దిరోజుల క్రితం ఓ రైలులో వచ్చి పొత్కపల్లి – జమ్మికుంట రైల్వేస్టేషన్ల మధ్య దిగాడు. రైలు పట్టాలపైనే తిరుగుతున్నాడు. ఈక్రమంలో శనివారం గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో తలపగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువులకు సమాచారం అందించి, కేసునమోదు చేసుకొన్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గంగానగర్ వద్ద శనివారం గంజాయి కలిగి ఉన్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ కథనం ప్రకారం.. గోదావరిఖని గంగానగర్ ఫ్లై ఓవర్ వద్ద టూటౌన్ ఎస్సై వెంకటకృష్ణ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో బైక్‌పై ముగ్గురు వచ్చారు. అనుమానంతో బైక్ ఆపి తనిఖీ చేయగా.. ట్యాంక్ కవర్‌లో 70గ్రాముల గంజాయి లభించింది. గంజాయితోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని, పవర్‌హౌస్ కాలనీకి చెందిన మొహమ్మద్ సాజిద్, కాకతీయకాలనీకి చెందిన తనుగుల అమన్, న్యూపోరట్‌పల్లికి చెందిన ఇదినూరి అక్షయ్‌ను అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ప్రసాద్‌రావు, ఎస్సై వెంకటకృష్ణ, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

పట్టించుకుంటే.. పర్యాటకమే

- అభివృద్ధికి నోచుకోని, ఆదరణ కరువైన కట్టడాలెన్నో..
- పేరుగాంచిన ఆలయాల వద్ద సౌకర్యాలలేమి
- కొన్నిచోట్లకు రవాణా సౌకర్యమూ లేదు
- పర్యాటకులు, భక్తుల ఇబ్బందులు
- ప్రభుత్వం చొరవ చూపితే ఉమ్మడి జిల్లాకు పర్యాటక శోభ

'ఎలగందుల'.. కళావిహీనమైన వేళ


చిరిగిపోయిన సౌండ్ అండ్ లైట్ షో స్క్రీన్

కొత్తపల్లి(కరీంనగర్): గత కాలపు చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఎలగందుల ఖిల్లా నిలుస్తోంది. కాకతీయులు, కుతుబ్‌షాహీల శిల్పకళా వైభవానికి ఇక్కడి కట్టడాలు ప్రతీక. ఈ ఖిల్లా 200 అడుగుల ఎత్తు, 2.5 మైళ్ల విస్తీర్ణంలో మానేరు నదిని ఆనుకొని, విస్తరించింది. కాకతీయులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మొగులులు, అసఫ్‌జాహీలు ఈ కోట కేంద్రంగా పరిపాలన సాగించారు. బహుధాన్యపురంగా పిలవబడే నేటి ఎలగందుల నాడు చెన్నూరు, జగిత్యాల, జమ్మికుంట, లక్షెట్టిపేట, సిద్దిపేట, మహదేవపూర్, సిరిసిల్ల, సుల్తానాబాద్, కరీంనగర్ తాలుకాలతో జిల్లా కేంద్రంగా విరాజిల్లింది. ఖిల్లాలో నిర్మితమైన నీలకంఠ స్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు, మసీదు హిందూముస్లింల ఐక్యతకు చిహ్నంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వాలు అరకొర నిధులు కేటాయిస్తుండటంతో ఈ ఖిల్లా ప్రస్తుతం అభివృద్ధికి నోచుకోక, ఆదరణ కరువై కళావిహీనంగా మారింది. పర్యాటకులను ఆకర్షించేందుకు, ఎలగందుల గత వైభవాన్ని కళ్లకు కట్టినట్లు రూపొందించిన 40 నిమిషాల సినిమా ప్రదర్శించేందుకు రూ.3.13 కోట్లతో సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది మూలన పడింది. ఇక్కడికి రావాలనుకునేవారికి సరైన రవాణా సౌకర్యం లేదు. ఖిల్లా పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయింది. సర్కారు దృష్టిసారిస్తే పర్యాటకులతో సందడిగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'రామునిగుండాల'కు.. అటవీ భూములే అడ్డంకి


రామునిగుండాల

రామగుండం: పట్టణ పరిధిలోని రామునిగుండాలలో రామలక్ష్మణులు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కొండపై 108 గుండాలున్నాయి. గుట్టపై 200 ఫీట్ల లోతు, 50 ఫీట్ల వెడల్పుతో ఓ లోయ ఉంది. లోయకు పైభాగాన ఉన్న బావిలో సీతాదేవి స్నానమాచరించిందని ప్రతీతి. రాముడు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పాద ముద్రికల స్థానంలో ఏర్పడిన గుంతలు గుండాలుగా మారి, రామగుండంగా పేరు వచ్చిందంటారు. ఈ గుండాలన్నింటిలో అన్ని కాలాల్లో నీరు సమృద్ధిగా ఉండటం విశేషం. లోయ మధ్యలో సొరంగ మార్గం ఉంది. దీన్ని యమకోణం అంటారు. ఇక్కడ నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. ఇందులో స్నానం చేస్తే యమలోక బాధలుండవని భక్తుల నమ్మకం. 2007లో మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇస్కాన్ సంస్థను సంప్రదించారు. రూ.200 కోట్లతో హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ మాదిరిగా దేవాలయం నిర్మించాలనుకున్నారు. కానీ, అటవీ భూములు అడ్డంకిగా మారడంతో ఇస్కాన్ సంస్థ విముఖత చూపింది. దీంతో పర్యాటకం మరుగున పడినట్లయింది. ప్రభుత్వంతోపాటు ఫారెస్టు అధికారులు సహకరిస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు. రామగుండాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అరకొర వసతుల నాంపల్లి గుట్ట


నాంపల్లి గుట్టపై కాళీయమర్దనం

వేములవాడ అర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన నాంపల్లి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. రాజన్నను దర్శించుకున్న చాలామంది ఇక్కడి స్వామివారికి పూజలు చేస్తారు. గుట్టపై పచ్చని చెట్ల మధ్య కాళీయమర్దనం ఆకట్టుకుంటుంది. గుట్ట పైనుంచి చూస్తే ఎడమవైపు వేములవాడ రాజన్న ఆలయం, మూలవాగు తీరం, కుడివైపు నిండుకుండను తలపించే మిడ్‌మానేరు ప్రాజెక్టు కనువిందు చేస్తాయి. ప్రభుత్వాలు మారినా లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏడాదికి కోటికి పైగా ఆదాయం వస్తున్నా అరకొర వసతుల మధ్య భక్తులు ఇబ్బంది పడుతున్నారు. చెట్ల కింద వంటలు చేసుకున్నా.. తినాలంటే కోతుల బెడద ఉందని అంటున్నారు. ప్రభుత్వం వసతులు కల్పించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు పంపించినా పనులు మాత్రం ప్రారంభించలేదు.

నిలిచిన కోటిలింగాల–ఎల్లంపల్లి బోటింగ్


ఎల్లంపల్లి ప్రాజెక్టు


కోటిలింగాలలో నిరుపయోగంగా బోటు (ఫైల్)

రామగుండం: గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్ అభివృద్ధికి రూ.750 కోట్లు కేటాయించి, అందులో ఎల్లంపల్లి ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసి, బోటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల నుంచి ఎల్లంపల్లి వరకు(20 కిలోమీటర్లు) గోదావరి నీటిలో బోటింగ్‌ను ప్రారంభించారు. కానీ, సాంకేతిక కారణాలతో అది నిలిచిపోయింది. బోటింగ్ కోసం కొనుగోలు చేసిన పులోమావి బోట్–30 సీట్లు, శాతకర్ణి–50 సీట్లు, స్పీడ్ బోట్–5 సీట్లు కోటిలింగాల దేవాలయ ప్రాంగణంలోని గోదావరి నీటిలో పార్కింగ్ చేసి, ఉంటారు. బోట్లు నిరుపయోగంగా మారడంతో పర్యాటకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి, ఎల్లంపల్లి వద్ద ఉద్యానవనాలు, పూలు, పండ్ల తోటలు పెంపకానికి, స్నాక్స్ స్టాల్స్ ఏర్పాటు, తాగునీటి వసతి, గోదావరి అందాలను కూర్చొని తిలకించేందుకు ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటుకు కృషి చేస్తే పండుగలు, వీకెండ్, సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి పెరిగి, ఆదాయం సమకూరుతుందని పలువురు అంటున్నారు.

మధ్యమానేరులో దత్తాత్రేయస్వామి


వరదవెల్లి దత్తాత్రేయస్వామి ఆలయం


బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలిశారు గురుదత్తాత్రేయస్వామి. ఇక్క డి ఆలయ పరిసరాల్లో పచ్చదనం పరుచుకుంది. గుట్టపై గ్రామస్తులు దత్త మందిరం నిర్మించారు. ఇక్కడ ఒకేసారి 300 జంటలు సామూహిక దత్తసత్య వ్ర తాలు చేసే వీలుంది. 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గుట్టపై ఏటా డిసెంబర్‌లో దత్త జ యంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. చుట్టూ నీరే ఉండటంతో అక్కడికి వెళ్లడం క ష్టం. ఉత్సవాల సమయంలో అధికారులు రెండు బోట్లు సమకూరుస్తారు. బోట్లలో వెళ్లినవారు గుట్టపైకి చేరాలంటే 100 వరకు మెట్లు ఉన్నాయి. మిగతా రోజుల్లో భక్తులు వెళ్లాలనుకున్నా వెళ్లలేరు. వంతెన నిర్మించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. గతేడాది దత్త జయంతి ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు బోటులో వచ్చి, స్వామివారికి పూజలు చేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు వంతెన నిర్మాణం కోసం సర్వే చేయాలని మిడ్‌మానేరు ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. సర్వే చేసి, డిజైన్ కోసం సీఈ సీడీవో కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

'కొత్తగట్టు'లో.. అసంపూర్తి పనులు


మత్స్యగిరీంద్రస్వామి ఆలయం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. ఇక్కడి గుట్టపై మత్స్యగిరీంద్రస్వామివారు వెలిశారు. 2002కు ముందు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు దర్శించుకునే వారు. గుట్టపైకి అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు పూర్తయి, వాహనాలు గుట్టపైకి వెళ్తున్నాయి. భక్తుల సహకారంతో ఆంజనేయస్వామి, పోచమ్మ ఆలయాలు నిర్మించారు. ప్రాకారం, కల్యాణం మండపం, రాజగోపురం నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. ఏటా బ్రహ్మోత్సవాకు రూ.10 లక్షలకు పైనే ఆదాయం వస్తోంది. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలకు ఈ దారిలో వెళ్లేవారు మత్స్యగిరీంద్ర స్వామివారిని దర్శించుకుంటున్నారు. కరీంనగర్ పట్టణం నుంచి 30 కి.మీ. దూరంలో ఉన్న విష్ణుమూర్తి అవతారమైన మత్స్యగిరీంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఏకైక దేవాలయం కావడం విశేషం. అసంపూర్తి పనులు పూర్తి చేసి, ఆలయాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటక శోభ సంతరించుకుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అన్నపూర్ణ ప్రాజెక్టుకు అన్ని అర్హతలు


అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టుకు టూరిస్ట్ స్పాట్‌గా మార్చేందుకు అన్ని అర్హతలున్నాయి. ఈ జలాశయం నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు. దీని చుట్టూ కొండలున్నాయి. ప్రాజెక్టు పక్కనే ఉన్న పట్నంగుట్ట ఎంతో ప్రసిద్ధి. గుట్టపై రాజులు పరిపాలించిన ఆనవాళ్లు ఉన్నాయి. రాతి దర్వాజాలు, పెద్ద బావి, రెండు కుంటలు కూడా ఉన్నాయి. ఇక్కడి ఢోనిలో ఎండాకాలంలోనూ నీరు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. జలాశయం పక్కన 92 మీటర్ల లోతు, 56 మీటర్ల వైశాల్యం గల సర్జిపూల్ ఉంది. గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయానికి ప్రతీ బుధ, గురు, ఆదివారాల్లో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇక్కడ పర్యటించిన సందర్భంగా అనంతగిరి ప్రాజెక్టును టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

త్రికూటాలయం.. నిధులు జాప్యం


చెన్నకేశవనాథ ఆలయంలో పంచముఖ లింగం

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని చెన్నకేశవనాథ త్రికూటాలయాన్ని కాకతీయ రాజుల కాలంలో నిర్మించారు. దేశంలోనే రెండో పంచముఖ లింగం ఇక్కడ ఉంది. ఈ ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. కానీ, నిధుల విడుదలలో తీవ్ర జాప్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేవలం రూ.30 లక్షలు విడుదలవడంతో ఆలయ ఆవరణలో కల్యాణ మండపం, షెడ్డు నిర్మాణం పూర్తయ్యాయి. సీసీరోడ్లు, కాంపౌండ్ వాల్, ఆఫీస్ రూంలు, బాత్‌రూం పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా నిధులు విడుదలయ్యేందుకు, నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ చూపాలని ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి కోరుతున్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని, పర్యాటకంగానూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి


గెలుపొందిన కరీంనగర్ బాలికల జట్టు

సుల్తానాబాద్(పెద్దపల్లి): చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉన్నత విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉంటాయని డీవైఎస్‌వో సురే శ్, ఎస్సై శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్–17 ఎస్జీఎఫ్ పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల బాలబాలికల వాలీబా ల్ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పోటీల్లో బాలుర విభాగంలో రాజన్న సిరిసిల్ల జట్టు ప్ర థమ, జగిత్యాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కరీంనగర్ ప్రథమ, రాజన్న సిరిసిల్ల ద్వితీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, సాయిరి మహేందర్, భాస్కర్, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్, ప్రసాద్, ఆమిరిశెట్టి తిరుపతి, బైరి రవీందర్‌గౌడ్, అంతటి శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన సిర్పూర్ ఎక్స్‌ప్రెస్

ఓదెల(పెద్దపల్లి): కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ 2 గంటల పాటు ఆలస్యంగా నడిచింది. శనివారం సిర్పూర్‌కాగజ్ నగర్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3.30 గంటలకు పెద్దపల్లికి రావాల్సి ఉండగా సాయంత్రం 5.40 గంటలకు రావడంతో ఓదెల, జమ్మికుంట నుంచి వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. సమయపాలన పాటించేలా రైల్వే ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


నగలను సందర్శిస్తున్న చైర్‌పర్సన్, మహిళలు

జగిత్యాల: జగిత్యాల విరూపాక్షి గార్డెన్స్‌లో శనివారం జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మేళాను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి జూయెల్లరీ జిల్లా కేంద్రంలో దొరుకుతుందని.. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మూడురోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, తెలంగాణ రీజినల్ మేనేజర్ రతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో అదనపు గదులు

- వెంటనే నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు
- ఓదెల కస్తూరిబా, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన


మాట్లాడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్

ఓదెల(పెద్దపల్లి): జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో అదనంగా గదులు నిర్మించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు సూచించారు. ఓదెలలోని కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్‌తోపాటు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. తమకు సరిపడా గదులు లేక తరగతి గదుల్లోనూ నిద్రపోతున్నామని పలువురు విద్యార్థినులు మహిళా కమిషన్ సభ్యురాలి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓదెల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు నిర్మించాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేసేలా విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఆడపిల్లలకు కల్పిస్తున్న భద్రత, తీసుకుంటున్న చర్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారం పై ఆరా తీశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఈ చేప పిల్లలు మాకొద్దు'


చేపపిల్లలను పరిశీలిస్తున్న నర్సయ్య, క్రాంతికుమార్

మంథని: 'ఈ చేప పిల్లలు మాకొద్దు.. చిన్న సైజ్‌లో ఉన్నాయి' అంటూ చేప పిల్లల వ్యాన్‌ను వెనక్కి పంపించామని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పోతరవేణి క్రాంతికుమార్ తెలిపారు. శనివారం మార్కెట్ యార్డుకు 2 లక్షల చేప పిల్లల వ్యాన్‌తో మత్స్యశాఖ జిల్లా అధికారి భాస్కర్ వచ్చారని, వాటిని పరిశీలించగా చిన్న సైజు ఉండడంతో వాపస్ పంపినట్లు వివరించారు. కాగా ఇటీవల మంథనిలో చేప పిల్లల విడుదల సందర్భంగా సైజు, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని రాష్ట్ర అధ్యక్షుడికి విన్నవించినా అధికార్లు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లినా కాంట్రాక్టర్ చిన్న సైజు చేప పిల్లలు తీసుకొచ్చాడని, మంత్రికి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రెఫర్ చేయడంలో ఆలస్యం.. కార్మికుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ


సురేశ్(ఫైల్)

గోదావరిఖని: స్థానిక పరుశరాంనగర్‌లో నివాసం ఉంటూ ఆర్కేపీ ఓసీపీలో హెడ్‌ఓవర్‌గా పనిచేస్తున్న కె.సురేశ్ (42) శనివారం మృతి చెందారు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. ఛాతీలో నొప్పితో శనివారం సింగరేణి ఏరియా ఆస్పత్రికి వచ్చి అడ్మిట్ అయ్యారు. పరిస్థితి గమనించిన వైద్యులు.. కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే ఇప్పటికే రెండు స్టంట్లు వేయించుకున్న ఆయనను హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి రెఫర్ చేయాలని కార్మికుడు, ఆయన కుటుంబ సభ్యులు కోరారు. ఈవిషయంలో సింగరేణి వైద్యులు సకాలంలో స్పందించలేదు. కరీంనగర్ వెళ్లడం తమకు కష్టమని, డిశ్చార్జి చేస్తే తామే హైదరాబాద్ వెళ్తామని సురేశ్ బంధువులు కోరారు. అయితే ఉదయం 8 గంటలకు ఆస్పత్రిలో చేరిన సురేశ్‌ను రెఫర్ చేసేందుకు సాయంత్రం వరకు సమయం తీసుకుంది. ఈక్రమంలో అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలిస్తుండగా రామగుండం బీ– పవర్ హౌస్‌గడ్డ వద్ద సురేశ్ మృతి చెందారు. మృతదేహాన్ని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చి మార్చురీలో ఉంచారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే కార్మికుడి ప్రాణం బలైందని టీబీజీకేఎస్ నాయకుడు మాదాసు రామ్మూర్తి, నాయకులు ఆరోపించారు. కాగా నెలవ్యవధిలో ఒకేఇంట్లో కార్మికుడు, కార్మికుడి తల్లి, మూడు రోజుల క్రితం కార్మికుడి సోదరుడు మృతి చెందడంతో తీరని విషాదం నెలకొంది. సురేశ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు ఎంపిక

కరీంనగర్‌సిటీ: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈనెల 22 – 31 వరకు అటల్ బిహారి వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ ఎలైట్ స్పోర్ట్స్ నిర్వహించే అడ్వెంచర్ క్యాంపునకు శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన 10 మంది వలంటీర్లు ఎంపికైనట్లు ప్రోగ్రాం అధికారి పడాల తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన వలంటీర్లను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్ అభినందించారు.